# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**

(P.O. Box 80) Seshagiri Rao St.

KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియచేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :** **J. C. CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **9** నవంబరు **1988** సంచిక **4**


## సంపాదకీయము

### పౌలు సువార్త

### ( *Paul's Gospel* )

అపొస్తలుడైన పౌలు ప్రకటించిన సువార్త అతనియొక్క సువార్త కాదు. సువార్తకు అతడు మూలాధారము కాదు. అతడు యేసుక్రీస్తు యొక్క సువార్తను ప్రకటించినందువలన అది అతని సువార్త కాదు. "కాబట్టి యెరూషలేము మొదలుకొని చుట్టుపట్ల నున్న ప్రదేశములందు ఇల్లూరికు ప్రాంతము వరకు క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించి యున్నాను" అని పౌలు రోమా 15 : 19 లో వ్రాయుచున్నాడు. యేసుక్రీస్తు మరణించి, పాతిపెట్టబడి, సమాధిలో నుండి తిరిగి లేచుటయే మంచి వార్త లేదా సువార్తయై యున్నది (రోమా 10:15; 1 కొరింథి 15:1-4). "కావున నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

యేసుక్రీస్తు అపొస్తలులకు యిచ్చిన గొప్ప ఆదేశమునే పౌలు ప్రకటించినాడు. "మరియు - మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ

సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడునని" ఆయన చెప్పెను (మార్కు 16:15, 16). ఇపుడు పౌలు రచనలను పరిశీలించినచో అతడు దేనిని ప్రకటించినాడో గ్రహింపవచ్చును. అతడు పూర్ణముగా క్రీస్తు సువార్తను ప్రకటించినాడని ఇంతకుమునుపే తెలుసుకొంటిమి. అతడు మరల కొరింథు క్రైస్తవుల కిట్లు వ్రాయుచున్నాడు. "నేను సువార్తను ప్రకటించుచున్నను నాకు అతిశయ కారణము లేదు. సువార్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడి యున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ" (1 కొరింధి 9:16). ఒకడు దేవుని, దేవుని కుమారుడైన యేసుక్రీస్తును నమ్ముటకు వినునట్లుగా అతడు మొదటిగా సువార్తను ప్రకటించినాడు (2 తిమో 4:2). "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగునని" (రోమా 10:17) లో అతడు చెప్పెను. రెండవదిగా, అతడు మారుమనస్సు యొక్క అవశ్యకతను లేదా ఒకడు తన గత పాపములనుండి మరలుకొల్పబడుటను గూర్చి బోధించినాడు. విగ్రహారాధికులైన ఏథెన్సువారితో అతడిట్లు పలికెను. "ఆ అజ్ఞాన కాలమును దేవుడు చూచి చూడనట్లుండెను. ఇప్పుడైతే అందరును అంతటను మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అ.కా. 17:30). మూడవదిగా, ఒకడు యేసుక్రీస్తునందు తనకుగల విశ్వాసమును ఒప్పుకొనుట తప్పనిసరి యని పౌలు ప్రకటించినాడు. అతడు రోమీయుల కిట్లు వ్రాయుచున్నాడు. "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10).

నమ్మకముతో బాటు యేసుక్రీస్తు దేవుని కుమారుడని (మత్తయి 10 : 32) ఒప్పుకొనుట గూడ రక్షణ పొందుటకు అవసరమని పౌలు చెప్పెను. వేరొక మాటలో చెప్పవలెననిన ఒకడు కేవలము విశ్వాసము

వలనైనను, కేవలము ఒప్పుకొనుటవలననైనను రక్షింపబడడు. అయితే నమ్మకము, ఒప్పుకోలు కూడ రక్షణపొందుటకు లేదా రక్షణవైపు నడుపుటకు అవసరమై యున్నవి. నాలుగవదిగా, ఒకడు బాప్తిస్మము పొందవలెనని అతడు బోధించెను. ఈ క్రియ కూడ అవసరమని చెప్పుకొన్న లేఖనములను గమనించుదము. "బాప్తిస్మము అనగా పాతిపెట్టబడుట" యని అతడు ప్రారంభించుచున్నాడు (కొలస్స 2.12; రోమా 6:3, 4). ప్రభువు మరణము, సమాధి, పునరుత్థానములకు బాప్తిస్మము సాదృశ్యముగా యున్నదని అతడు చెప్పుచున్నాడు. మరల పౌలుయొక్క మాటలను గమనింపుము, "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3, 4). యేసుక్రీస్తున కేమి సంభవించినది? ఆయన మరణము నొందెను. పాతిపెట్టబడెను. సమాధినుండి తిరిగి లేచెనని పౌలు 1 కొరింథీ 15:1-4లో చెప్పుచున్నాడు. కనుక ఒక పాపి సువార్తకు లోబడి నప్పుడు ఏమి జరుగునో గమనించుము. పాపి తన పాపముల నిమిత్తము మరణించును, అతడు బాప్తిస్మపు నీటిలో పాతిపెట్టబడును. చివరగా అతడు ఆ నీటి సమాధినుండి లేపబడుట ద్వారా యేసుక్రీస్తు నందు నూతన జీవితమును జీవించును (2 కొరింథీ 5:17). ఒకడు అవ్విధముగా చేయుటవలన అతడు ప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములలో పాలుపొందుచున్నాడు.

పౌలు తాను సువార్తకు లోబడినపు డేమిచేసెనో ఇప్పుడు గమనించుదము. అ.కా. 9,22 అధ్యాయములను బట్టి చూడగా అతడు

యేసుక్రీస్తును నమ్మినాడు, పాపముల నిమిత్తము మారుమనస్సు పొందినాడు, ప్రభువును ఒప్పుకొనిన పిమ్మట బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడినాడు. "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది పాపములను కడిగివేసుకొనుమని" సువార్త బోధకుడైన అననీయ చెప్పెనని పౌలు తనంతట తానే చెప్పుకొనెను (అ.కా. 22:16).

యేసుక్రీస్తు యొక్క అనుచరుడు ఆయన సువార్తను బోధించిన పౌలు, బాప్తిస్మము మనలను ఆయనలోనికి లేదా సంఘములోనికి ప్రవేశపెట్టునని బోధించుచున్నాడు. "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీ రందరు క్రీస్తును ధరించుకొని యున్నారని" పౌలు చెప్పెను (గలతి 3:26, 27). మరియొక సందర్భములో అతడిట్లనెను: "ఎలాగనగా, యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింధి 12 : 13). అతడు చెప్పిన ఆ ఒక్క శరీరము సంఘమై యున్నది (కొలస్స 1 : 18; ఎఫెసి 1:22, 23).

అపొస్తలుల కార్యముల గ్రంథమును చదువుచుండగా సౌలు లేదా పౌలుయొక్క మార్పు నొందుటను గూర్చియే గాక అనేక సందర్భములలో పౌలు బోధించగా అనేక మంది మార్పు నొందినట్లు గమనించగలము. ఉదాహరణకు, అ.కా. 16వ అధ్యాయంలో లూదియ తన యింటి వారితో రక్షణ పొందినట్లు చూడగలము. అటు తరువాత ఫిలిప్పీ చెరశాల అధికారి అతని యింటివారు ఎట్లు రక్షణ పొందిరో చదువగలము. ఈ రెండు సందర్భములలోను వాక్యము బోధింపబడినది. వారు విశ్వసించి, మారుమనస్సు నొంది, యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని, బాప్తిస్మము నొందిరి. మిగిలిన సంద

ర్భములలో రక్షణ పొందు సమయములలో గూడ ఇదే విధానము అనుసరింపబడినది.

పౌలు పేతురు ఇరువురు ప్రకటించిన సువార్త యొక్కటే. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో పెంతెకొస్తు దినమున పేతురు మిగిలిన అపొస్తలులు యెరూషలేములో ప్రకటించిన సువార్తను గమనించుము. ప్రజలు విశ్వసించునట్లు వారు సువార్తను ప్రకటించిరని వ్రాయబడి యున్నది. వారు నమ్మిన తరువాత వారు ఏమి చేయవలెనో తెలిసికొనవలెనని వారు కోరిరి. అపుడు పేతురు వారికిట్లు జవాబిచ్చెను. "మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అపుడు మీకు పరిశుద్ధాత్మ అను వరము అనుగ్రహింపబడును" (అ.కా. 2:38). "ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి - మీరు మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను. కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (అ.కా. 2:40, 41). చివరగా, వారు దేవుని స్తుతించుచు ప్రజలందరివలన దయ పొందిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అ.కా. 2:47). కావున అదే సువార్తను పౌలు ప్రకటించినాడు. ఫిలిప్పు మిగిలిన బోధకులు గూడ ఖచ్చితముగా అదే సువార్తను ప్రకటించిరనునది సత్యమై యున్నది.

ఒకానొక సందర్భములో కొరింథు సంఘములో మానవుల శ్రేష్టత్వమును గూర్చిన సమస్య తలయెత్తినది (1 కొరింథి 10). వారిలోగల విభజనలను ఖండించుచు, ప్రభువునందు వారేకముగా యుండవలెననియు, క్రీస్తుకు ఒకే సంఘము కలదని పౌలు హెచ్చరించి

నాడు. బాప్తిస్మ మిచ్చుటకు గాక సువార్త ప్రకటించుటకు తానెట్లు పంపబడినాడో వారికి విశదపరచినాడు. లేఖనభాగమును కొందరు అపార్థము చేసుకొనుచు బాప్తిస్మ మిచ్చుటకంటె సువార్త ప్రకటన యను నది బహు ప్రాముఖ్యమైనదని చెప్పుచుందురు. అట్టి బోధ సరియైనది కాదు. ఏలయనగా పౌలు క్రమానుగతముగా చేయవలసిన సంగతులను గూర్చి చెప్పుచున్నాడు. సువార్త ప్రకటన యనునది మొట్టమొదటి బాధ్యతయై యున్నది. అట్లు ప్రకటింపగా లోబడువారు నెరవేర్చ వలసిన ఆఖరు క్రియయైన బాప్తిస్మ మిచ్చుటకు కూడ అతడు సిద్ధముగా యుండెడివాడు. పౌలు కొందరికి బాప్తిస్మ మిచ్చినట్లు గూడ చూడగలము. కొందరికి మిగిలిన వారు బాప్తిస్మ మిచ్చియుండిరి. దీనినిబట్టి బాప్తిస్మము అక్కరలేదని అతడు చెప్పుటలేదు గాని సువార్త ప్రకటింపబడక పోయినచో బాప్తిస్మము నిష్ప్రయోజనమే. వారు విని హృదయ పూర్వకముగా లోబడుచు సరియైన సంకల్పముతో బాప్తిస్మము పొందినపుడు మాత్రమే అది ప్రయోజనకరమగును.

చివరిగా పౌలు బోధించుచు సువార్త ఒక్కటేననియు దానిని అతడు ప్రకటించినాడని చెప్పుకొనెను. అతడు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను ప్రకటించిన వారెవరైనను, దేవదూతలైనా సరే అట్టివానికి శ్రమ యని అతడు చెప్పెను.

గలతీ క్రైస్తవుల కిట్లు చెప్పుచున్నాడు : "క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచిన వానిని విడిచి, భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్త కాదు గాని, క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరున్నారు. మేము మీకు ప్రకటించిన సువార్తను గాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక. మేమిది వరకు చెప్పిన ప్రకారం మిప్పుడును మరల చెప్పుచున్నాము;

మీరు అంగీకరించిన సువార్త గాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించినయెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతి 1:6-9).

కనుక నేడు మన సంగతి యేమి? మనము ప్రకటింప వలసిన సువార్త యేదది? సూక్ష్మముగా చెప్పవలెనన్న, యేసుక్రీస్తుయొక్క సువార్తను మనము ప్రకటింపవలసి యున్నది. అపొస్తలుడైన పౌలు, పేతురు, మిగిలిన సువార్త బోధకులందరు వారివారి దినములలో ప్రక టించిన సువార్తనే మనమును ప్రకటింపవలసి యున్నది. "మీరు అంగీకరించిన సువార్తను గాక మరియొకటి యెవడైనను మీకు ప్రక టించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గలతి 1:9) అని పౌలు చెప్పుచున్నాడు.

నేడు అనేక విభిన్న సువార్తలు ప్రకటింపబడుచుండుట మనకు తెలిసినదే. ఒక విధముగా నీవు రక్షణ పొందుదువని యొకడు బోధిం పగా, మరియొక విధముగా రక్షణ పొందగలమని వేరొకడు బోధించు చున్నాడు. నీవు విను ప్రతి విషయము అది బైబిలునుండి సంగ్రహింప బడినదని నీకు చెప్పినను నీవు నమ్మవద్దను హెచ్చరిక యివ్వబడు చున్నది. అనేకులు అబద్ధ బోధలు చేయుచున్నారనుట నిస్సందే హము. ఇట్టి బోధలవలన మనము లేఖనార్థమైన ఒకే సువార్తయొద్దకు తిరిగి రావలసిన ఆవశ్యకత గలదని నిశ్చయముగా గ్రహింపవలెను. మానవులేమి బోధించుచున్నను ప్రభువు ఆయన మార్గము మాత్రమే సత్యమై యున్నది.

## యేసు, సర్వశక్తుడగు దేవుని కుమారుడు

## *(Jesus: The Powerful Son of God)*

క్రీస్తును వెంబడించిన జనసమూహములు ఆయన బోధలకును

ఇశ్రాయేలీయుల అధికారుల, శాస్త్రుల యొక్క బోధలకును నడుమ గల వ్యత్యాసమువలన ఊరడి నొందిరి. మత్తయి 5-7 అధ్యాయములలో ఆశ్చర్యకరమైన ఆయన బోధలు తదుపరి బైబిలునందిట్లు గలదు. "యేసు ఈ మాటలు చెప్పి ముగించినపుడు జనసమూహాలు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7 : 28, 29). కావున ఇట్టి జనసమూహాముల దృష్టిలో యేసుక్రీస్తు ఒక విభిన్నమైన వ్యక్తి యనునది స్పష్టమగుచున్నది. ఆయనయొక్క ఉనికి, బోధనాపద్ధతి, ఆయన మాటలు వినుటకు ఆయనను దర్శించుటకు వచ్చు ప్రజలందరిపట్ల ఆయనకు గల దయ, శాస్త్రుల, పరిసయ్యుల, సద్దూకయ్యుల బోధలను సవాలు చేసెడి ఆయన దృక్పథము మొదలగు గుణములన్నియు యేసును సామాన్య ప్రజలకు చేరువ జేసినవి. నజరేతువాడైన యొక సామాన్య వడ్రంగి కుమారుడు, ఉపదేశకుడు, ప్రయాణము చేయు నొక బోధకుడుగా, ఏమియు లేని వాడుగా యేసుక్రీస్తును చూడగలము. అయినప్పటికి కొన్ని వందల సంవత్సరములకు మునుపే ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేయబడిన మెస్సియా (క్రీస్తు) నైన దేవుని కుమారుడనని ఆయన తనను గూర్చి చెప్పుకొనినాడు. అందు వలన జనసమూహాములు ఆయనను గూర్చి అపోహపడినది సరియే. ఏలయనగా ఆయన యొక విభిన్నమైన వ్యక్తి. దేవుని కుమారుడనని చెప్పుకొనుటకు మాత్రమే గాక దానిని ఋజువు చేయుటకును ఆయన పూర్తిగా సిద్ధపడినాడు.

తమ మెస్సియా (క్రీస్తు లేదా రారాజు) సర్వశక్తిమంతుడుగా నుండునని ఇశ్రాయేలు నిరీక్షించిరి. అనగా మెస్సియా ఒక గొప్ప సర్వసైనాధిపతిగా నుండునని వారి ఉద్దేశ్యమై యున్నది. అయితే యేసుక్రీస్తు ఒక ప్రత్యేక తరహాలో తన అధికారమును బయలుపరచినాడు. యేసుక్రీస్తు సర్వశక్తుడగు దేవుని కుమారుడని

ఋజువు చేయు సంఘటనలకు ఆరంభము మత్తయి 8వ అధ్యాయము నందు గలదు.

1. యేసుకు వ్యాధులపై అధికారము గలదు :— యేసుక్రీస్తు యొక్క కొండమీది ప్రసంగపు ముగింపుతో మత్తయి 8వ అధ్యాయము ఆరంభమగుచున్నది. యేసు కొండపై నుండి దిగి రాగా, జన సమూహము లాయనను వెంబడించిరి. పిమ్మట జైబిలునందిట్లు గలదు : "ఇదిగో కుష్ఠురోగి వచ్చి ఆయనకు మొక్కి – ప్రభువా, నీ కిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను" (8:2). కుష్ఠువ్యాధిని స్వస్థపరచుట యనునది మానవ శక్తికి మించినది. అయినప్పటికి ఈ వెలివేయబడిన అపవిత్రుడు యేసుక్రీస్తు తనను స్వస్థపరచగలడని గ్రహించినాడు. ఆ కుష్ఠురోగి వినయముగా యేసును సమీపించి 'ప్రభువా' అని ఆయ నను సంబోధించుచు తన నమ్మకమును ధైర్యముగా తెలియజేసినాడు. యేసుక్రీస్తు తనను శుద్ధునిగా చేయుటకు యిష్టపడినచో అనగా ఆయ నకు స్వస్థపరచు అధికారము గలదని అతడు గ్రహించినాడు. "అందు కాయన చెయ్యి చాపి వాని ముట్టి - నా కిష్టమే నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తత్క్షణమే వాని కుష్ఠురోగము శుద్ధియాయెను" (మత్తయి 8:3). ఆ కుష్ఠురోగి, జనసమూహములు ఈ అద్భుతము జరుగుట చూచి ఎంత ఆశ్చర్యపడియుందురో ఊహించుము. మానవుడు కుష్ఠువ్యాధిని బాగుచేయలేకుండెడివాడు. సర్వశక్తుడగు పరలోక దేవుని నుండియే స్వస్థత అనుగ్రహింపబడినట్లు చూడగలము. యేసు బాగుచేయగలడను కుష్ఠురోగియొక్క విశ్వాసము సరియైనదేనని నిరూపింపబడినది. యేసుక్రీస్తుయొక్క బోధలే అధికారయుక్తమైనవి కాదు గాని అద్భుతములు చేయు శక్తి కూడ ఆయన దేవుని కుమారుడైన క్రీస్తు అని నిరూపించుచున్నది.

వ్యాధులపై ఆయనకు గల అధికారమును తెలియజేయు రెండవ

సంఘటన ఈ కుష్ఠురోగి సంఘటన తరువాతనే వ్రాయబడినది. "ఆయన కపెర్నహూములో ప్రవేశించినపుడు ఒక శతాధిపతి ఆయన యొద్దకువచ్చి ప్రభువా, నా దాసుడు పక్షవాయువుతో మిగుల బాధ పడుచు ఇంటిలో పడియున్నాడని చెప్పి, ఆయనను వేడుకొనెను" (మత్తయి 8:5, 6). రోమా సైన్యములో అధిపతియైన ఈ వ్యక్తి బహుశ యూదుడు కాకపోవచ్చును. కుష్ఠురోగివలె ఈ శతాధిపతికూడ యేసు వ్యాధులను స్వస్థపరచగలవాడని నమ్మినాడు. ఈ శతాధిపతి విన్నపమును ప్రభువు పూర్తిగా యెరిగినవాడై అతనితో వాని యింటికి వెళ్ళి అతని దాసుని స్వస్థపరచుటకు యిష్టపడెను. అయినప్పటికి "శతాధిపతి - ప్రభువా, నీవు నా యింటికిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను; నీవు మాటమాత్రము సెలవిమ్ము, అప్పుడు నా దాసుడు స్వస్థపరచబడును" అనెను (మత్తయి 8:8). రోగులను స్వస్థపరచగల డను యేసు అధికారమును యూదులలో అనేకమంది గ్రహింపక పోయినను ఈ రోమా అధిపతి గ్రహించినట్లు మనము అంగీకరింపవలెను. శతాధిపతి యిట్లనుచున్నాడు. నేనుకూడ అధికారమునకు లోబడిన వాడను. నా చేతిక్రింద సైనికులున్నారు : "నేను ఒకని పొమ్మంటే పోవును. ఒకని రమ్మంటే వచ్చును. నా దాసుని ఈ పని చేయమంటే చేయును అని యుత్తరమిచ్చెను" (మత్తయి 8:9). అధికారముతో కూడిన పరిస్థితిలెట్లుండునో ఈ అధిపతి యెరిగినవాడై యున్నాడు. ఆయన మాటమాత్రము సెలవిచ్చిన ఆయన యిష్టము నెరవేర్చునని అతడు తెలిసికొనినాడు. గనుక యేసు మాటమాత్రము సెలవిచ్చిన తన దాసుడు స్వస్థపడునని అతని నమ్మకము. ఈ శతాధిపతి విశ్వాసము చూచి యేసు ఆశ్చర్యపడినాడు. "యేసు ఈ మాట విని ఆశ్చర్యపడి, వెంట వచ్చుచున్న వారిని చూచి - ఇశ్రాయేలులో నెవనికైనను నేనింత విశ్వాసమున్నట్టు చూడలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" అనెను (మత్తయి 8:10). ఇక్కడ యేసుక్రీస్తు

స్వస్థీయులకంటె ఆయన యందుగల విశ్వాసమును యొక అన్యుడు అగుపరచినాడు. తత్ఫలితముగా శతాధిపతి యొక్క విశ్వాసమునకు ప్రతిఫలము లభించినది. రోగియైన దాసుని గల వాని గృహమును యేసు దర్శింపలేదు. అంతట యేసు - "ఇక వెళ్లుము; నీవు విశ్వసించిన ప్రకారము నీకు అవునుగాకని శతాధిపతితో చెప్పెను. ఆ గడియలోనే అతని దాసుడు స్వస్థత నొందెను" (మత్త 8:13). యేసుక్రీస్తు దూరము నుండియే వ్యాధులను స్వస్థపరచుటవలన వాటిపై తనకు గల శక్తిని అధికారమును ఆయన కనుపరచినాడు. ఇట్టి రకమైన అధికారమును శక్తిని కనుపరచిన వ్యక్తి తప్పనిసరిగా దేవుని కుమారుడై యుండును.

మూడవదిగా, ఆయన శిష్యులలో నొకని ద్వారా ఆయనకు వ్యాధులపై గల అధికారము బయలుపరచబడినది. "తరువాత యేసు పేతురింటిలో ప్రవేశించి, జ్వరముతో పడియున్న అతని అత్తను చూచి ఆమె చెయ్యి ముట్టగా జ్వర మామెను విడిచెను; అంతట ఆమె లేచి ఆయనకు ఉపచారము చేయసాగెను" (మత్త 8:14, 15). ఆయన కేవలము పేతురు అత్త చేయిని ముట్టగానే జ్వరమామెను విడిచెను. తక్షణమే ఆమె సంపూర్ణ శక్తిని పొంది యేసుకును ఆయనతో నున్న వారికిని ఉపచారము చేసెను. సాయంకాలమైనప్పుడు ఆయన యొద్దకు తెచ్చిన అనేక రోగులను ఆయన బాగుచేసినాడు (8 : 16).

ఆయన దేవుని కుమారుడని యేసు చెప్పినాడు. సకల వ్యాధులపై తనకు గల అధికారమును కనుపరచుటద్వారా తన్ను గూర్చి తానెవరని ఆయన చెప్పుకొనినాడో అది ఋజువైనది.

2. ప్రకృతిపై యేసుకు గల అధికారము :-"ఆయన దోనె యెక్కినపుడు ఆయన శిష్యులు ఆయన వెంట వెళ్లిరి. అంతట సముద్రము మీద తుఫాను లేచినందున ఆ దోనె అలలచేత కప్పబడెను.

అప్పుడాయన నిద్రించుచుండెను" (8:23, 24). ఈ తుఫానును గూర్చి పూర్తి వివరణ గమనింపుము. మొదటిగా అది "గొప్ప తుఫాను" గా నున్నందున నిశ్చయముగా యిది మామూలు తుఫాను ఏమాత్రము కాదని అర్థమగుచున్నది. రెండవదిగా, శిష్యులలో కొందరు జాలరులు గలరు. సముద్రములో వచ్చు తుఫానుల నెరిగినవారై యున్నప్పటికి ఈ తుఫానుకు వారు మిక్కిలి భయపడిరి. మూడవదిగా, "ఆ దోనె అలలచే కప్పబడెనని" వ్రాయబడినది. ఆ దోనె మునిగిపోవు ప్రమాదములో గలదని శిష్యులు భావించిరి. ఇట్టి గందరగోళ పరిస్థితులలో కూడ యేసు నిద్రించుచునే యుండెను, "వారు ఆయన యొద్దకు వచ్చి ప్రభువా, నశించుపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి. అందుకాయన - అల్ప విశ్వాసులారా, యెందుకు మీరు భయపడుచున్నారని వారిని ప్రశ్నించెను" (8:25, 26). ఆయన ప్రశ్న శిష్యులకు కష్టముగా నుండినట్లు కన్పించుచున్నది. దోనె మునిగిపోవుచున్నదని శిష్యులు భావించుచుండగా - ఎందుకు భయపడుచున్నారని యేసు ప్రశ్నించుచున్నాడు! తుఫాను తీవ్రతను ఆయన చూచియుండి కూడ దానిచే కదిలింపబడక యున్నాడు. విశ్వాసము లేనందువలననే మీరు భయపడుచున్నారని యేసు చెప్పెను. అదే దినమున యేసు చేసిన అనేక సూచక క్రియలను వారు చూచియుండిరి. వ్యాధులను పోగొట్టిన యేసు తీవ్రమగుచున్న తుఫానును నిరోధించుటకు అధికారము లేనివాడా? అంతట "ఆయన లేచి గాలిని సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళ మాయెను" (8:26). యేసుయొక్క అధికారము వలన గొప్ప తుఫాను మిక్కిలి నిమ్మళమాయెను. "ఆ మనుష్యులు ఆశ్చర్యపడి - ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి" (8:27).

నేను దేవుని కుమారుడనని ఆయన చెప్పుకొనిన మాటలు ప్రకృతిపై ఆయనకు గల అధికారము ఋజువగుటవలన మిక్కిలి బలపడినవి

## 3. యేసుకు దయ్యములపై గల అధికారము :—

"యేసు తన శిష్యులతో కూడ గలిలయ సముద్రపు అద్దరినిగల గదరేనీయుల దేశము చేరగా దయ్యములు పట్టిన ఇద్దరు మనుష్యులు సమాధులలో నుండి బయలుదేరి ఆయనకు ఎదురుగా వచ్చిరి. వారు మిగుల ఉగ్రులైనందున ఎవడును ఆ మార్గమున వెళ్ళలేక పోయిరి. వారు - ఇదిగో దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాక మునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా? అని కేకలు వేసిరి" (మత్త 8.28, 29). వారు అపాయకరమగు మనుష్యులైనందున ఎవడును వారిని సమీపింపలేక పోయిరి. అయినను యేసుపట్ల వారి క్రియలు వారిపట్ల ఆయన క్రియలు గమనించుము. వెంటనే యేసు దేవుని కుమారుడని దయ్యములు గుర్తించినవి (యాకోబు 2:19). వాటిపై ఆయనకు గల అధికారమును అవి యెరిగి యుండుటచేత భయముతో ఆయనను వేడుకొనినట్లు చూడగలము. "వెళ్ళుడి" అను ఒకే పదముతో యేసు వాటిని వెళ్ళగొట్టి అవి పందుల మందలో ప్రవేశించుటకు అనుమతి నిచ్చెను. "ఇదిగో ఆ మందంతయు ప్రపాతము నుండి సముద్రములోనికి వడిగా పరుగెత్తికొని పోయి నీళ్ళలో పడి చచ్చెను" (8:32). ఈ సందర్భములో యేసు కనుపరచిన అధికారము గమనింపని వారెవరును లేరు. ఆ దేశపు వారెన్నడును ఇట్టి అధికారము నెరిగినవారు కారు. అందువలన వారు ఆయన అధికారమునకు ఆశ్చర్యపడి మిక్కిలి భయపడిరి. "ఇదిగో ఆ పట్టణస్థు లందరు యేసును ఎదుర్కొనవచ్చి ఆయనను చూచి తమ ప్రాంతములను విడిచి పొమ్మని ఆయనను వేడుకొనిరి" (8:34).

యేసుకు గల శక్తివంటిది ఇశ్రాయేలీయులలో ఎన్నడును ఎవరికిని అనుగ్రహింపబడి యుండలేదు. యూదుల అధికారియైన నికోదేము ఆయనతో యిట్లనెను: "బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే

గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:2). ఆయనయొక్క శక్తి, అధికారములు ప్రత్యక్షపరచుటను గూర్చిన నిరూపణ లనేకములను యూదులు గ్రహించిరి. అందువలన దేవుని కుమారుడని ఆయన చెప్పుకొనిన సంగతిని అనేకులు కాదనలేకపోయిరి. తాను చేసిన అద్భుతములను గూర్చి ఆయన యిట్లు చెప్పుకొనినాడు. "నేను నా తండ్రి నామమందు చేయుచున్న క్రియలు నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" (యోహాను 10:25). పిమ్మట యోహాను యిట్లు వ్రాసినాడు. "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవముపొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30, 31). దైవావేశమువలన కలిగిన లేఖనము లేదా బైబిలు గ్రంథము వలన నేడు ఆయన యొక్క అధికారము, శక్తి మరియు ఆయన సర్వశక్తుడగు దేవుని కుమారుడైన క్రీస్తు (మెస్సియా) యని ఋజువగుచున్నది. "పరలోక మందును, భూమిమీదను నాకు సర్వాధికార మివ్వబడి యున్నదని యేసు చెప్పెను (మత్తయి 28:18). "సర్వ శరీరాలమీదను" ఆయనకు అధికారము గలదు (యోహాను 17:2). గనుక నిజముగ యేసు సర్వశక్తుడగు దేవుని కుమారుడై యున్నాడు.

—మైక్ హాడ్గిన్స్

---

## సిలువవేయబడిన యేసుక్రీస్తు

*( Jesus Christ - Crucified )*

"సిలువ వేయబడిన యేసుక్రీస్తు" (1 కొరింథి 2:2). ఈ వాక్యమును నీ వెన్నడు అర్థము చేసుకొంటివి? క్రీస్తుయొక్క సిలువ మరణములో నీ కొరకేమైనా ప్రత్యేకత యున్నదా?

నేను రక్షింపబడగలనను భావము సిలువ మరణములో గలదు :— నా పాపముల వలన నేను దేవుని యెదుట మరణమునకు పాత్రుడుగా నుంటిని (రోమా 6:23). అయితే యేసుక్రీస్తు సిలువపై నా కొరకు మరణించినాడు (రోమా 4:25). సిలువపై ఆయన తన పాపములను భరింపలేదు గాని సర్వమానవుల పాపములను భరించి నాడు.

నేను దేవుని కుమారునిగా నుండగలనను భావము సిలువ మరణములో గలదు :- ఆయన మరణము ద్వారా మనము దేవునితో సమాధానము గలవారమై యున్నాము. కుమారునిగా నుండు హక్కు మనకు పునరుద్ధరింప బడినది (గలతి 4:5-7). కుమారునిగా యుండుట వలన సర్వశక్తిమంతుడగు దేవుని పిల్లలకుండు సర్వహక్కులు, మేళ్ళను నేను అనుభవించుటకు అర్హుడనై తిని (రోమా 8:16-18).

యేసుక్రీస్తు సిలువ మరణ మొందినందున నాకు మరణ భయము లేదు :-యేసుక్రీస్తు మరణమును జయించినందువలన విశ్వాసులైన క్రైస్తవు లందరు వారు మరణించినప్పటికి జీవించుదురను వాగ్దానము అనుగ్రహింపబడినది (యోహాను 11:25). ఆయన మరణింపనిచో పునరుత్థానము కూడ యుండెడిది కాదు. ఆయన పునరుత్థానమే లేకున్నచో మనమును నిత్యజీవమును పొందుటకు తిరిగి లేచెదమను నిరీక్షణ యుండెడిది కాదు (1 కొరింధి 15:12-19). చివరకు విజయము ననుగ్రహించునది ఈ క్రియయే.

గనుక మానవు లందరియొక్క నిరీక్షణ క్రీస్తుయొక్క రాకడకు ఆస్పదముగా నున్నది. క్రీస్తుయొక్క సిలువ మరణము మన జీవితములో అత్యున్నతమైనదిగా నుండవలయును. క్రీస్తు నా కొరకు మరణింప నిచ్ఛయించుట వలన ఆనందము నిత్యజీవములో ఆయనతో కలిసి యుండు

నను నిరీక్షణను నాకు కల్గించు మన్నది. కాబట్టి సిలువ వేయబడిన యేసు క్రీస్తును తప్ప యింకేవరిని పౌలు ప్రకటింపకుండుటలో మన కెంత మాత్రము ఆశ్చర్యము అక్కరలేదు. ★

—కోసీ లోవే.

## దేవుని సంకల్పము - మానవుని మనోభావము

### ( *God's Plan – Man's Opinion* )

సిరియా రాజు సైన్యాధిపతియైన నయమాను తనకున్న కుష్ఠు వ్యాధినుండి శుద్ధి పొందాలని కోరి షోమ్రోనులోనున్న ఎలీషా ప్రవక్త యొద్దకు పరివారంతో బయలుదేరాడు. "నయమాను గుఱ్ఱములతోను రథముతోను వచ్చి ఎలీషా యింటి ద్వారము ముందర నిలిచి యుండగా ఎలీషా నీవు యోర్దాను నదికి పోయి యేడు మారులు స్నానముచేయుము. నీ ఒళ్లు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను."

"అందుకు నయమాను కోపము తెచ్చుకొని తిరిగి పోయి యిట్లనెను - అతడు నాయొద్దకు వచ్చి నిలిచి తన దేవుడైన యెహోవా నామమునుబట్టి తన చెయ్యి రోగముగా ఉన్న స్థలముమీద ఆడించి కుష్ఠురోగమును మాన్పునని నేననుకొంటిని" (2 రాజు 5:9-11). ఇచ్చట రెండు విషయాలు మనం గమనించవలసి యున్నది. నయమాను శుద్ధి యగుటకు దేవుని ప్రవక్త. ఎలీషా చెప్పిన పని. రెండవది నయమాను తన మనసులో తలంచిన విధము మరొక మాటలో దేవుని సంకల్పము - మానవుని మనో భావము.

నయమాను ఎలీషా సూచించిన సూక్ష్మ మార్గమును వెంబడించుటకు ఇష్టపడక రౌద్రుడై తిరిగి వెళ్లిపోయెను. ఎలీషా చెప్పిన మాట అనగా నీటిలో మునుగుట శుద్ధి యగుటకు మార్గమని భావించ

క్షేమః- అతడు శుద్ధుడు కావలెనని కోరుకొనును. దాని నిమిత్తము ఏ గొప్ప కార్యము చేయుటకైనను సిద్ధపడి యుండెను. కాని ఏడు మారులు యొర్దాను నదిలో మునిగినపుడు మాత్రమే అతడు శుద్ధి యగునట్లు దేవుని నిర్ణయము.

ఎలీషా తన యొద్దకు వచ్చి, నిలిచి యెహోవా నామమును బట్టి వ్యాధిగ్రస్తమైన స్థలముమీద చెయ్యి ఆడించి శుద్ధిచేయాలనునది మానవ అభిప్రాయము. నేడు ఇదే పరిస్థితి మన మధ్యనున్నది. నమ్మి ముంచబడు పొందినవాడు రక్షింపబడుననునది లేఖన సారాంశమైతే, దాని విడిచిపెట్టి లోతైన అనుభవం కొరకు తాపత్రియ పడటం విచిత్రమైన పరిస్థితి. పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగ దిగి రావాలని నిరీక్షించడం, దేవుని పిలుపు కొరకు ఎదురు చూడటం, ఆయన దర్శనం, ఆయన పేరుపెట్టి పిలవడం ఇవి రక్షణకు మార్గాలని, ఇదే రక్షణానుభవం అని కొందరి నమ్మకం. నయమాను కూడ ఈ విధంగానే ఆలోచించి శుద్ధి కాలేకపోయాడు. ప్రవక్త చెప్పిన మాట వినడమే శుద్ధికి మార్గమన్న తన దాసునిద్వారా హెచ్చరింపబడినవాడై శుద్ధి పొందాడు. మానవుడు తన మనసులో ఊహించిన విధం అతని రక్షింప జాలదు.

ఒకని సాక్ష్యం, ఒకని అనుభవం, మరొకని మనోభావం రక్షణకు మార్గం కాదు. రక్షణ కావాలంటే తెరువబడిన బైబిలు గ్రంథం నొద్దకు వచ్చి పఠించుము. ఆయన ఆజ్ఞలకు విధేయుడవు కమ్ము. రక్షింపబడుదువు.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## బాప్తిస్మము - పరిశుద్ధాత్ముడు

### *( Baptism and the Holy Spirit )*

ఆదినుంచి అంతము వరకు రక్షణ దేవుని క్రియయై యున్నది.

పాపవిమోచనలో మానవుని సహకారము యొక్క సమర్థత యేమిలేదు. ఈ రక్షణ "మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ 2:8, 9). విశ్వాసముద్వారా కృపచేతనే రక్షణ యను అంశమును చర్చించిన తరువాత అపొస్తలుడైన పౌలు, దేవుని మహిమను కొనియాడాడు గాని మానవుని కాదు: "ఆహా, దేవుని బుద్ధిజ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము,..... ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగి యున్నవి. యుగముల వరకు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమెన్" (రోమా 11:33-36).

దైవ కార్యక్రమములో బాప్తిస్మము కూడ భాగమే. ఈ దైవాజ్ఞకు లోబడుటలో సంభవించే రక్షణ దేవుని వరమే గాని మానవుని క్రియ వలన సంక్రమించినది కాదు. మానవునిమట్టుకైతే అది ఒక స్నానము వంటిదే (1 పేతురు 3:21). అయితే బాప్తిస్మముయొక్క యదార్థమైన శక్తి దేవుని శక్తిలో యున్న కార్యసాధకమైన విశ్వాసమే (కొలస్స 2:12). భౌతిక సంబంధమైన స్నానము (ముంచుట) ద్వారా విధేయత చూపుచు "దేవుని యెడల నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరము" నిచ్చుచున్నాము. అది క్రీస్తు పునరుత్థానముగా మనలను రక్షించును. రక్షణ యను దేవుని వరానికి బాప్తిస్మము తన ఏకైక సాక్ష్యాన్నిచ్చుచున్నది.

ప్రతి మలుపులోను రక్షణ దేవునినుండియే కలుగును. తండ్రియైన దేవుడు తన నిత్య సంకల్పములో దాన్ని రూపించాడు. కుమారుడైన దేవుడు తన పరిపూర్ణ జీవితంలో దాన్ని అనుగ్రహించాడు. పరిశుద్ధాత్ముడైన దేవుడు సువార్త పరిచర్యలో దాన్ని కొనసాగించుచున్నాడు.

# నీరు - ఆత్మ

మానవుని మార్పు-ఉపదేశముల (Conversion and Initiation) క్రియ యగు బాప్తిస్మము పరిశుద్ధాత్ముని వ్యక్తిత్వము, పనితో పూర్ణ సంబంధము కలిగి యున్నది. యేసు తన పరిచర్య ఆరంభము లోనే బాప్తిస్మమును ఆత్మను సంయోగించాడు. మానవునిలో ఆత్మ జీవమును సృజించు క్రొత్త జన్మ "నీటిమూలముగను ఆత్మమూలము గను" కలిగిన జన్మ (యోహాను 3:5). ఈ అనుభవము అవిభజనాత్మకం.

యేసు పరిచర్యలోని ఆఖరి మాటలలో క్రొత్త నిబంధన బాప్తిస్మమును గూర్చిన ఆజ్ఞ యొకటి. ప్రతిస్పందించు శిష్యులయొక్క బాప్తిస్మము "తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి" ఇయ్యబడాలి (మత్త 28:19). బాప్తిస్మము పరిశుద్ధాత్ముడు ఈ దిగువ లేఖనాల్లో ముఖ్యంగా ముడివడి యున్నవి : అపొ. కా. 2:38; 1 కొరింథీ 6:11; తీతు 3:5. బాప్తిస్మములో పరిశుద్ధాత్ముని క్రియను ఈ ఒక్కొక్క వచనములో గమనించగలము.

## ఆత్మచే నడిపింపబడుట

దైవాజ్ఞయైన ఈ క్రియకు మనము సమర్పించుకొనునప్పుడు పరిశుద్ధాత్ముడు మనలను నడిపించును. అపొస్తలులు బోధించేటప్పుడు ఉపదేశించేటప్పుడు వారు పరిశుద్ధాత్మచే నడిపింపబడుదురని యేసు వాగ్దానం చేసాడు. వారు క్రీస్తును ప్రకటించడానికి బయలు వెళ్ళినప్పుడు, "ఏలాగు మాటలాడుదుము? ఏమి చెప్పుదుము?" అని చింతించనవసరం లేదు. ఏలయనగా తండ్రి ఆత్మ వారిలో ఉండి మాటలాడునేగాని మాటలాడునది వారుకారు (మత్త 10 : 19).

ఆత్మను గూర్చిన వాగ్దానాన్ని అపొ. యోహాను వివరంగా

యోహాను సువార్త 14-16 అధ్యాయాల్లో లిఖించాడు. యేసు ఇట్లెసెను: "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). యోహాను 15:26; 16:12-16 లో యేసు ఈ వాగ్దానాన్ని మరింత వివరించాడు. వారి జీవితాల్లోకి ఆత్మశక్తి ఊదబడి, యేసును తండ్రి పంపిన ప్రకారము వారును యేసునుండి పంపబడ్డారు (యోహాను 20:21). వారి ప్రభువు పరిశుద్ధాత్మ ద్వారా వారికనుగ్రహించిన అధికారము చొప్పున వారు మాటలాడ గలిగారు.

ఆత్మయొక్క నడిపింపు వలన క్రీస్తు ప్రతినిధులైన వీరు "మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మసంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే బోధించుచున్నామని" చెప్పగలిగారు (1 కొరి 2:13).

క్రీస్తు రాయబారుల కీయబడిన హెచ్చరికలు లేఖనాల్లో భద్రపరచబడి యున్నవి. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకు, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16,17). క్రొత్త నిబంధన లేఖనాలను తయారు చేయుటలో పరిశుద్ధాత్ముని పని వలన రక్షణ సంకల్పములో దేవుని చిత్తాన్ని మనమెరుగుదుము.

అపొస్తలుల బోధలో బాప్తిస్మమొక భాగమని మన మెరుగుదుము. మార్పు జెందినవారి ప్రతి సందర్భములో యేసుయొక్క రాజరికమును అంగీకరించినవాడు నీటిలో ముంచబడు అవసరమని గోచరమగుచున్నది. మొదటి శతాబ్దపు క్రైస్తవుల మార్పు - ఉపదేశములో

బాప్తిస్మమొక ప్రాముఖ్య భాగమను వాస్తవాన్ని ఎవరు కాదనలేదు. దైవాత్మ వర్తమానమును అపొస్తలులు నమ్మకముగా ప్రచురణ చేసారని మనము నమ్మినట్లయితే, మన రక్షణలో బాప్తిస్మముయొక్క ప్రాముఖ్య పాత్రను అంగీకరించాలి.

ఆదిలో వర్తమానము నిచ్చిన పరిశుద్ధాత్ముడే నేడు కూడ సువార్త ప్రకటనద్వారా "పాపమును గూర్చియు నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయుచున్నాడు" (యోహాను 16:18). దేవుని వాక్యము నేటికింకను ఆత్మ ఖడ్గమై యున్నది. సువార్త వాక్యము ప్రకటింపబడినప్పుడెల్లా, మానవుల హృదయాలను కోసి ఒప్పించుటకును, క్రీస్తులో రక్షణ మార్గమును చూపించుటకును పరిశుద్ధాత్ముడు తన ఖడ్గమును ఇంకను వినియోగించుచున్నాడు (అపొ.కా. 2:37; హెబ్రీ 4:12).

## ఆత్మద్వారా పునర్జన్మ

ప్రకటింపబడిన వాక్యమును బట్టి మానవులు విశ్వసించునట్లు పరిశుద్ధాత్మ ఎప్పుడు నడుపునో, వారు విశ్వాసమునకు విధేయులగుచు దేవుని వర్తమానమునకు ప్రతిస్పందిస్తారు (రోమా 1:5). విశ్వాసి బాప్తిస్మము పొందుటలో ఈ విధేయత గల మనసు వ్యక్తపరచబడతాది. సంఘ జననదినమందున్న విశ్వాసులవలె "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుదాత్మ అను వరమును పొందుదురు" అని హెచ్చరిక చేయబడతారు (అపొ. కా. 2:38). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన ఆ విశ్వాసికి వాగ్దానము చేయబడిన ఆత్మవరమేమిటి ?

ఒకటి, మార్పుజెందిన వాని ఆత్మలో పరిశుద్ధాత్ముడు [illegible]గించు పరసంబంధమైన పునర్జన్మ. అనేక శతాబ్దముల [illegible] ప్రవక్తయైన యెహెజ్కేలు దేవుని సమాధానాగ్రమైన [illegible]

గూర్చి ప్రవచించాడు (యెహెజ్కేలు 37:26). పునర్నిర్మించబడిన ఈ బంధముయొక్క శక్తివంతమైన భాగమేమంటే దేవుడు తన ఆత్మను వారిలో ఉంచును, వారు బ్రదుకుదురు (యెహెజ్కేలు 37:14).

నీకొదేముతో మాట్లాడుచు యేసుచెప్పిన పరిశుద్ధాత్మ చేయు పునర్జన్మ క్రియ ఇది (యోహాను 3:3). ప్రకృతి జన్మద్వారా ఒకడు ఈ లోకంలో ప్రవేశిస్తాడు గాని ఒకడు నీటిమూలముగాను ఆత్మ మూలముగాను జన్మించినప్పుడు తిరిగి జన్మిస్తాడు. ఒకడు వృద్ధుడైనను బాప్తిస్మముద్వారా జన్మించినప్పు డతడు ఆత్మద్వారా జన్మిస్తాడు. అతడు ఆంతరంగికంగా నూతన పురుషుడు!

బాప్తిస్మము సమయంలో సంభవించు పునర్జన్మ తీతు 3:5లో వివరించబడింది: "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుటద్వారాను మనలను రక్షించెను." బాప్తిస్మములో పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయును. ఆత్మయొక్క ఈ పనిని పౌలు ఇట్లు సూచించాడు: "ఏలయనగా, యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మన మందరము ఒక్క ఆత్మను పానముచేసిన వారమైతిమి" (1 కొరింథీ 12:13).

## ఆత్మద్వారా మార్చబడుట

బాప్తిస్మము పొందినప్పుడు మనలను రక్షించే నూతన క్రియలో త్మయొక్క పని గొప్పదైనను, అది దానితో అంతము కాదు. అపొ. కా. 2:38లో గల వాగ్దానము ప్రస్తుతాన్ని మించినదై యున్నది. మనము మార్పు జెందినప్పుడు నూతన సృష్టిగా మనలను జేయడమే

కాకుండ, ఆ ఘడియనుండి ఆత్మ మనలో నివసించుట కారంభించును. తనకు విధేయులైన వారికి దేవుడు పరిశుద్ధాత్మ ననుగ్రహించును (అపొ. కా. 5:32). ఆ ఘడియనుండి క్రైస్తవుని శరీరము పరిశుద్ధాత్మ యొక్క ఆలయమై యుండవలెను. ఆత్మయైన దేవుడు వ్యక్తిగతంగా నివసించే పరిశుద్ధ మందిరమది (1 కొరి 6:19).

మనలో నివసించు పరిశుద్ధాత్ముడు చేయు పరిచర్య యేమిటి? ఆయన తన ఉపదేశముద్వారా నూతన స్వభావము కలిగి జీవించే శక్తిని మనకు దయచేయును. క్రైస్తవులు కాకముందు కొరింథీయులు నానావిధములైన అపవిత్రముతో నిండియుండిరి. అయితే వారిలో గొప్ప మార్పు సంభవించినది: "మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని, ప్రభువైన యేసుక్రీస్తు నామమున మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరి 6:11).

పరిశుద్ధాత్మ వలన స్వతంత్రులుగా చేయబడిన వారమై (గలతీ 4:6), అవినీతికరమైన జీవితానికి ఇక దాసులము కాము. శరీరేచ్ఛలను బట్టి జీవించుట ఇక మన ధ్యేయముకాదు (గలతీ 5:16). ఏలయనగా ఆత్మను బట్టి జీవించుట మన అభ్యాసము. తత్ఫలితంగా పరిశుద్ధాత్మ ఫలములు మన జీవితంలో మెండుగా కనబడును, ఇప్పుడు మనము ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము మొదలగు గుణములను ప్రదర్శింతుము (గలతీ 5:22, 23).

బాప్తిస్మము వలన సంభవించిన మార్పుతో ఆరంభమై "మన మందరమును ముసుగులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధికమహిమ పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3 : 18)

—డేన్ ఏండర్స్.

## "నేనే జీవమును"

## (I am the Life)

యేసు "జీవాహారము నేనే. మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి. దీనిని తినువాడు చావకుండునట్లు పరలోకమునుండి దిగివచ్చిన ఆహారమిదే పరలోకమునుండి దిగివచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును. మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవముకొరకైన నా శరీరమే అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 6:47-51). అందుకు యేసు. "పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" (యోహాను 11:25-26). "నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోకి రాక మరణములోనుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మృతులు దేవుని కుమారుని శబ్దము వినుగడియ వచ్చుచున్నది. ఇప్పుడే వచ్చియున్నది. దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24-25). క్రీస్తు పునరుత్థానమందు ఆయన స్వరము విని మృతులు అందరు లేపబడుదురు. భూలోకమందున్నప్పుడే ఆయన కొందరిని మృతులలోనుండి లేపియున్నాడు. ఆయన స్వరము విని చనిపోయినవారు బ్రతికిరి.

ఆయన చనిపోయిన నాయీను విధవరాలి కుమారుని బ్రతికించెను. "ఆయన-చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయిన వాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను. ఆయన అతనిని అతని తల్లికి అప్పగించెను" (లూకా 7:11-16). యాయీరు కుమార్తె చనిపోయినది. క్రీస్తు ఆమెను బ్రతికించెను. అయితే ఆయన ఆమె చెయ్యి పట్టుకుని చిన్నదానా లెమ్మని చెప్పగా, ఆమె ప్రాణము తిరిగి వచ్చెను గనుక వెంటనే ఆమె లేచెను (లూకా 8:49-56).

చనిపోయి సమాధిలో పెట్టబడిన లాజరును ఆయన బ్రతికించెను. ఆయన లాజరూ బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా, చనిపోయినవాడు కాళ్ళు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను, (యోహాను 11:43).

పై ముగ్గురు బ్రతికించబడిన విధములో ప్రభువు ఎవరిని రమ్మని పిలిచితే, వారే సమాధినుండి బ్రతికించబడి బయటికి వచ్చిరి. ఆయన ఫలానా అని పేరు చెప్పి పిలిచి, వారిని బ్రతికించెను.

## క్రీస్తు ఆత్మీయ మరణమునుండి బ్రతికించుచున్నాడు

"మీ అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను" (ఎఫెసీ 2:1). చచ్చినవారై యుండగా అనగా, ఇది శరీర సంబంధమైన చావు కాదు. ఆత్మసంబంధమైన చావు. "అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు. నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:17).

ఆదాము హవ్వలు సాతాను శోధనకు లొంగి ఆ పండు తిన్నప్పుడు వారికి శరీరసంబంధమైన చావు త్వరలో రాలేదు గాని ఆత్మీయముగా చచ్చిరి. దేవుని యెదుటికి రాలేకపోయిరి. "మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" (యెషయా 59:1-2). ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము. పాపముచేయువాడే మరణము నొందును (రోమా 6:23). "ఏ భేదమును లేదు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23).

గనుక దానిని బట్టి చూడగా మానవులందరును ఆత్మీయముగా చచ్చినవారై యున్నారు. మానవులందరు కదలుచున్నారు. చూస్తు

న్నారు పని చేయుచున్నారు ప్రయాస పడుచున్నారు గాని వారందరు దేవుని దృష్టిలో చచ్చిన శవములవలెను ఎండిపోయిన ఎముకలవలెను కన్పించుచున్నారు. కారణం - వారు ఆత్మీయముగా చచ్చి - దేవునికి దూరముగా జీవించుచు పాపమందు మునిగి నశించుచున్నారు. అయితే మానవులు నశించిపోవుట దేవుని కిష్టములేదు. "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23).

పాపము వలన కోల్పోయిన ఆత్మీయ జీవమును తిరిగి సంపాదించుకోవలెనన్న మానవుడు పాపమునుండి విడుదల పొందవలెను. మానవుడు పొందవలసిన పాపశిక్షను, దేవుడు తన కుమారునిపై మోపి పాపమునకు శిక్ష విధించెను. క్రీస్తు సిలువపై మన పాప ఋణమును తీర్చెను. మానవ పాప మును దేవుని కోపమును భరించి ఆయన మరణముద్వారా పాపఋణమును తీర్చెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

మానవుడు పాపముచేసి నశించినప్పుడు దేవుడు తన కుమారుని పంపి ఆయన మరణముద్వారా పాపులను రక్షించి, నిత్యజీవమును అనుగ్రహించెను. ఇంకను దేవుని ప్రజలని చెప్పుకొనుచు జీవన్మృతులుగానే ఉన్నవారి గతి నిత్యనరకము. క్రీస్తునందు నిత్యజీవమును పొంది నిరంతరము ఆయనలో ఉండు భాగ్యమును పొందుటకు తీర్మానించుకొనాలి. "యేసు - నేనే మార్గమును, సత్యమును, జీవమును నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6).

పరలోకమందున్న తండ్రియైన దేవుని యొద్దకు వెళ్లువారు నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడని ప్రభువు చెప్పెను. ఎందుకనగా ఆయనే మార్గము, సత్యము, జీవమునై

యున్నాడు. "మరి ఎవనివలనను రక్షణ కలుగదు. ఈ నామముననే (అనగా యేసుక్రీస్తు నామముననే) మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ. కా. 4:12).

"యేసు వారియొద్దకు వచ్చి - పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది (మత్తయి 28:18). గనుక ఎవడైనను పరలోకమందున్న తండ్రియొద్దకు వెళ్లవలెనన్న అతడు క్రీస్తులో నుండవలెను. క్రీస్తు పరలోకమునుండి భూలోకమునకు వచ్చినాడు. తిరిగి దేవుని చిత్తమును నెరవేర్చి పరలోకమునకు వెళ్ళిపోయెను. ఆయన మరల తిరిగి రెండవసారి వచ్చి తనయందున్న వారిని పరలోకమునకు తీసికొనిపోవును. నీవు క్రీస్తులోవుంటే క్రీస్తుతో పరలోకమునకు కొనిపోబడుదువు.

"కాబట్టి ఇప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏశిక్షావిధియు లేదు" (రోమా 8:1). "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3.27). "నాయందు నిలిచి యుండుడి. మీయందు నేనును నిలిచియుందును" (యోహాను 15:4).

క్రీస్తు నామము ధరించుకున్న క్రైస్తవు లందరు పరలోక రాజ్యమునకు వెళ్ళలేరు, గాని క్రీస్తులో క్రీస్తు శరీరములో ఆయన సంఘములో ఆయన రాజ్యములోనున్న వారు మాత్రమే పరలోక రాజ్యములో తండ్రితో సదాకాల ముండుటకు కొనిపోబడుదురు. నీవు క్రీస్తులో లేకపోయిన ఆనాడు విడువబడుదువు. నా ద్వారా తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడని ప్రభువు చెప్పిన మాటలు విన్నాము. ఆయనే మార్గము సత్యము జీవమై యున్నాడు. పరలోకరాజ్యములో చేరు కృప ఆయనద్వారా మనకు కలుగునుగాక. ★

పి. ప్రకాశం, హైదరాబాద్.

# ప్రత్యేక ఆహ్వానము

# BIBLE SEMINAR

## AT KAKINADA

**1988 డిశంబరు 11 నుండి 16 వరకు**

ప్రసంగీకులు : **Bro.** పెర్రి కోతమ్, **USA**

(గొప్ప బైబిలు విద్వాంసులు)

భోజన వసతులు ఉచితం.

అందరికీ ఆహ్వానం ! అందరికీ మా స్వాగతం !!

వివరములకు : **KAKINADA SCHOOL OF PREACHING**
**Kakinada-533 004**

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

**No.**

**To**

........................................

........................................

........................................

........................................